క్లుప్తంగా

హజ్‌యాత్రికులకు ప్రభుత్వ సాయం హర్షణీయం



మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలపై ఆర్థిక భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, స్థానిక జామియా మసీదు చైర్మన్ ఖాశింబేగ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలపై పడే రూ.80వేల అదనపు ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ముస్లింలపై సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న ప్రేమాభిమానాలకు ముస్లింలంతా ధన్యవాదాలు తెలుపుతున్నారన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు అమాన్, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆసక్తిగల విద్యార్థులు జూన్ 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సవిత శుక్రవారం తెలిపారు. మోడల్ స్కూలులో ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ప్రవేశం ఉంటుందని, ఇంగ్లిష్‌లో బోధన ఉంటుందన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150 ఫీజు చెల్లించాలన్నారు. మార్కులు మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశం కల్పిస్తామని, పూర్తి వివరాలకు స్థానిక ఆదర్శ పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నందవరం : మండల పరిధిలోని ముగతి ఏపీ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో 2023-24 విద్యా సంవత్సరం సంబంధించి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ప్రస్తుత విద్యా సంత్సవరంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 22 నుంచి జూన్ 07వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో గేట్ వే ద్వారా రుసుము చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. http://apms.ap.gov.in/apms అనే వైబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మిద్దెపై నిద్రిస్తుండగా ఇంట్లో చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వెంకటాపురం కాలనీలో మిద్దెపై నిద్రిస్తుండగా ఇంట్లో చోరీ జరిగిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వెంకటాపురం కాలనీకి చెందిన హమాలీ నరసింహులు కుటుంబ సభ్యులు భోజనం చేసి ఇంటికి తాళం వేసి మిద్దెపై పడుకున్నారు. అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో, డబ్బాలో దాచుకున్న రూ.లక్ష నగదు, పావు తులం బంగారు దొంగలించుకెళ్లారు. శనివారం తెల్లవారుజామున మూత్ర విసర్జన కోసం కిందకు వచ్చిన నరసింహులు ఇంటి తలుపులు తెలిసి ఉండటం చూసి లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. మొక్కజొన్న దిగుబడులు అమ్మగా వచ్చిన డబ్బు, పనులకు వెళ్లి సంపాదించ్చిన నగదుతో పాటు పావు తులం బంగారు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు. చోరీపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

మందకృష్ణ అరెస్టు అప్రజాస్వామికం

గోనెగండ్ల: హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ ప్రొఫెసర్ ఖాసీం చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఎమ్మార్పీఎస్ జిల్లాఉపాధ్యక్షుడు గంజల్లా మహాదేవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం గోనెగండ్లలో స్థానిక నాయకులతో కలిసి మందకృష్ణ మాదిగ అరెస్టుపై నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరితే మందకృష్ణను అరెస్టు చేసి పోలీసు స్టేషన్ తరలించడం దారుణమన్నారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

నందవరం : గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం స్థానికి ఉపాధి కార్యాలయంలో ఏపీఓ మాలిక్‌బాషా ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పండ్లతోట పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి సాగుకు ప్రోత్సాహించాలన్నారు. ప్రభుత్వం 100 శాతం రాయితీని కల్పింస్తుందన్నారు. అలాగే గ్రామాల్లో ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈసీ నూర్జ హాన్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చేనేతలు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి
- కార్మికులకు హ్యాండ్లూమ్ యంత్రాల పంపిణీ



చేనేత కార్మికులకు హ్యాండ్లూమ్ యంత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మికులు పోటీ వస్త్రప్రపంచంలో నిలదొక్కుకొనేందుకు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, ఆర్థికంగా బలోపేతమైతేనే చేనేత రంగానికి పూర్వవైభవం వస్తుందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి పథకంలో భాగంగా చేనేత క్లస్టర్‌గా ఎంపికైన ఎమ్మిగనూరు పట్టణంలోని చేనేత కార్మికులకు స్థానిక వైడబ్ల్యూసీఎస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం అధునిక సాంకేతికతతో కూడిన యంత్రాలను పంపిణీ చేశారు. 65 మంది రూ.12,28,500 విలువైన మోటోరైజడ్ లిఫ్టింగ్ డివైస్‌లు, 20మందికి రూ.6.30లక్షలతో జకార్డ్ విత్ కంప్లీట్ సెట్‌లు, 39మందికి రూ.11,23,200 విలువైన ఐరన్‌ఫ్రేమ్‌లను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, తిరుపతి చేనేత, జౌళిశాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు రాజారావు, వైడబ్ల్యూసీఎస్ చైర్మన్ బండా నాగరాజులతో కలిసి ఎమ్మెల్యే కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద ఎమ్మిగనూరు క్లస్టర్‌కు రూ.135.44 లక్షలు మంజూరు కాగా అందులో మొదటి విడతగా రూ.44.585లక్షల విలువైన యంత్రాలు మంజూరయ్యాయన్నారు. క్లస్టర్ కింద చేనేత కార్మికులకు 90శాతం సబ్సిడీపై నేతకు కావాల్సిన పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. ఈయంత్రాలతో నూతన డిజైన్లతో నాణ్యమైన వస్త్రాలు తయారు చేసుకునేందుకు కార్మికులకు ఎంతో ఉపయోగపడనున్నాయని తెలిపారు. నేత వృత్తిలో ఉపాధి కరువై చితికిపోయిన చేనేతలకు సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత వారి జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24వేలతో పాటు 50ఏళ్లకే చేనేత కార్మికులకు పింఛన్లు అందజేస్తున్నారన్నారు. చేనేతలు ఇతర వృత్తుల్లో వెళ్లకుండా నేత పనిని స్థానిక సొసైటీలోనే కొనసాగించాలని, తద్వారా సొసైటీ అభివృద్ధి చెందడంతో పాటు లాభాల్లో కార్మికులు భాగస్వాములవుతారని సూచించారు. నాడు పద్మశ్రీ మాచాని సోమప్ప, మాచాని శివన్నలతో ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలు ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకొన్నాయని గుర్తు చేశారు. తర్వాతి కాలంలో ఈరంగం కొంత మందగమనంలో పయనించినా సీఎం వైఎస్ జగన్‌తో మళ్లీ చేనేతకు మళ్లీ పూర్వవైభవం వచ్చిందన్నారు. గద్వాల చీరల నేత పని కోసం అడ్వాన్స్‌లు తీసుకొని ఇబ్బందులు పడే దానికంటే సాంకేతికతలో శిక్షణ పొంది సొంతంగా నూతన డిజైన్లతో నాణ్యమైన వస్త్రాలు నేసి అభివృద్ధి చెందాలని, ఇందుకు ప్రభుత్వం, సొసైటీ చేయూతనందిస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ హరికృష్ణ , వైడబ్ల్యూసీఎస్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ ఎంకే శివప్రసాద్, వైడబ్ల్యూసీఎస్ డైరెక్టర్లు పొబ్బతి నాగరాజు, వెంకటేష్, దేవేంద్రప్ప, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ప్రజా పాలన సీఎం జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి
- మద్దికెరలో గడప గడపకు మన ప్రభుత్వం

మద్దికెర : ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయిందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయోనని తెలుసుకునేందుకు మీ ఇంటి వద్దకే తాము మీ ముందుకు వచ్చామని, ప్రజా పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం మద్దికెరలోని మెయిన్ బజార్, చర్చి వీధి, మద్దమ్మబావి వీధులలో ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓపీఆర్డీ మద్దిలేటిస్వామి, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత సర్పంచ్‌లు సుహాసిని, మల్లికార్జున, ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు శాంతన్న, సుబ్బయ్య, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ యుగంధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి

కృష్ణగిరి:మండలంలోని సంగాల- ఆగవేళి గ్రామాల మధ్య నల్లేని కొండ వద్ద రూ.4,30,000 విలువ చేసే 45 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్దుర్తి సీఐ యుగంధర్ తెలిపారు. అలాగే ఒక కారు, రెండు స్కూటర్లను సీజ్ చేసిన ట్లు చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్ర వారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కృష్ణగిరి మండలం సంగాల గ్రామానికి చెందిన కురువ నంద్యాల మద్దయ్యకు అనంతపురానికి చెందిన రవికిరణ్‌తో పరిచయం ఏర్పడింది. ఇతనితో కర్ణాటక రాష్ట్రానికి చెందిన టెట్రా ప్యాకెట్లను కారులో తెప్పించుకుని వాటిని తన కుమారుడు మోహన్‌తో కలిసి చుట్టు పక్కల గ్రా మాలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున రవికిరణ్ (ఏపీ20ఏఎక్స్ 7231) మహీంద్రా వెరిటో కారులో కర్ణాటకకు చెందిన టెట్రా ప్యాకెట్లను తీసుకుని సంగాల-ఆగవేళి గ్రామాల మధ్య నల్లేని కొండ వద్దకు వచ్చి దింపుతుండగా ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి ముందస్తు సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. ఈ సమయంలోనే ఎరుకలచెర్వు గ్రామానికి చెందిన ఎరుకల శ్రీను బాక్సుల కోసం అక్కడకు రావడంతో అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 4,320 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో పాల్గొన్న ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, పీసీలు అంజినేయులు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, హోంగార్డు జయన్నని ఆయన అభినందించారు.

పేదలకు ఇళ్లిస్తే చంద్రబాబుకు కడుపుమంట



ఎమ్మిగనూరులో చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం



ఆలూరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మద్దికెర : అమరావతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇంటిపట్టాలు మంజూరుచేసి సొంతింటి కలను నిజం ఇస్తుండడంతో మాజీ సీఎం చంద్రబాబు నాయుడికి కడుప మంట పుట్టిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ధ్వజమెత్తారు. ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలపై బాబు వాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం మద్దికెరలో నిరసన ర్యాలీ నిర్వహించి చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటిపట్టాలను సమాధులతో పోల్చడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు, ఎంపీటీసీ ఆంజనేయులు, రామకృష్ణరెడ్డి, రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలను కించపరచడం బాబుకు తగదు

ఎమ్మిగనూరుటౌన్: పేదల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తుంటే ఆ ఇళ్లు శవాలను పూడ్చేందుకు కూడా సరిపోదని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు పేదలను కించపరిచే విధంగా మాట్లాడటం తగదని వైఎస్సార్‌సీపీ నియోజవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు బడుగులను కించ పరిచే విధంగా మాట్లాడటాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తునా నిరసన ర్యాలీ నిర్వహించారు. సోమప్ప సర్కిల్‌లో చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల నేరవేర్చేందుకు 34లక్షల ఇళ్ల నిర్మాణాలకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుడితే పక్కా ఇళ్లపై కించపరిచే విధంగా బాబు మాట్లాడటం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, ఎంపీపీ కేశన్న, కౌన్సిలర్లు,పార్టీ నాయకులు, వార్డు ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మతి భ్రమించింది

ఆలూరు: టీడీపీ అధినేత మాజీ సీఎం చంద్రబాబు నాయుడికి మతి భ్రమించి మాట్లాడుతున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, వైస్ చైర్మెన్ ఈరన్న, చింతకుంట సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, బీసీ మాదన్న, ఆలూరు మండల కన్వీనర్ వీరేష్ తదితరులు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి కళ్లకు గంతలు కట్టుకుని అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీరాములు, ఆలూరు మండలం కో కన్వీనర్ హనుమయ్య, నాయకులు గోవిందు, నబీ, కోయి నగరశేఖర్, దీపక్‌కుమార్, రామాంజనేయులు, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

- డ్వామా పీడీ అమర్నాథరెడ్డి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్నాథరెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని డ్వామా పీడీ అమర్నాథరెడ్డి తెలిపారు. వెల్దుర్తి సమీపంలోని చెరువులో పశువుల కంట పనులను, ఉపాధి పథకం కింద సాగుచేసిన పండ్ల మొక్కలను శుక్రవారం ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా లక్షన్నర మంది ప్రతి రోజు పనులకు వస్తున్నారని మరో వారంలోగా కూలీలందరికీ వందశాతం పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా భూగర్భ జలాలు పెంపు, రైతులకు ఉపయోగపడే పనులను చేపడుతున్నామన్నారు. వెల్దుర్తి మండలంలో 90శాతం మందికి పనులు కల్పిస్తున్నారని, వందశాతం కల్పించాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున కూలీలు ఉదయం త్వరగా వచ్చి పనులు చేసుకోవాలని, పని ప్రదేశంలో నీడ, తాగు నీరు, ప్రథమ చికత్స సంబంధించిన కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. సమీపంలోని పొలాల్లో ఉపాధి పథకం కింద సాగుచేసిన జామ, చినీ తదితర పండ్ల తోటలను పరిశీలించారు. పీడీ వెంట క్లస్టర్ కోర్స్ డైరెక్టర్ ఎర్రమల, ఏపీఓ రాజునాయక్, ఈసీ భరత్, టీఏ నాగేశ్వరరెడ్డి, రాజశేఖర్, ఎఫ్ఏ శ్రీదేవి ఉన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: ఖరీఫ్ సాగులో రైతులకు మెలకువలు పాటించాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ పి.సుజాతమ్మ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం - రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేరుశనగ సాగు చేస్తున్న ఒంటెడుదిన్నె, హెచ్.కైరవాడి, ఐరన్‌బండ గ్రామాల రైతులకు ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

విత్తనాలకురిజిష్ట్రేషన్ తప్పనిసరి

కృష్ణగిరి: సబ్సిడీ విత్తనాల కోసం రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. రైతు వాటా చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. వేరుశనగ విత్తనాలతో పాటు కంది, కొర్ర విత్తనాలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు.

వీఆర్‌కు కానిస్టేబుల్ రవి

ఎమ్మిగనూరురూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రవిని జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. వీఆర్‌కు పంపడానికి గల కారణం తెలియదంటూ పట్టణ పోలీసులు దాటి వేస్తున్నారు. చాల రోజులు క్రైం పార్టీలో పీసీ రవి పనిచేశాడు.

సుందరయ్యకు నివాళి

హొళగుంద/గోనెగండ్ల/ఆస్పరి: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని హొళగుందలో, ఆస్పరిలో, గోనెగండ్ల మండలాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు వెంకటేష్, చాకలి నాగరాజు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు, హనుమంతు, మల్లేష్, చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కట్టడికి చర్యలు

ఆలూరు రూరల్: అక్రమ మద్యం కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు, నంద్యాల జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆలూరు సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం తరలిస్తు పట్టుబడిన 4 ద్విచక్ర వాహనాలను వేలం వేశారు. జీఎస్టీతో కలిపి వచ్చిన మొత్తం రూ.79.060 ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తున్నట్లు చెప్పారు. ఆలూరు సెబ్ సీఐ ఎర్రవెంకట్, ఎస్ఐ రాజశేఖర్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

హోంగార్డుల సేవలు ఎనలేనివి

పత్తికొండటౌన్: పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల సేవలు ఎనలేనివని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని హోంగార్డ్స్ కమాండెంట్ పి.మహేశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పత్తికొండలో దర్బార్ నిర్వహించారు. పత్తికొండ అర్బన్, రూరల్, వెల్దుర్తి సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న హోంగార్డులు ఈ దర్బార్‌కు హాజరయ్యారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు



బొందిమడుగుల సచివాలయం తనిఖీ చేస్తున్న ఆర్డీవో మోహన్‌దాస్

తుగ్గలి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ బాధ్యతతో అందించాలని పత్తికొండ ఆర్డీవో మోహన్‌దాస్ అన్నారు. శుక్రవారం బొందిమడుగుల సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించి అర్హులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు బాధ్యతతో అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం భూ సమస్యలకు సంబంధించి రికార్డులను పరిశీలించి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తహసీల్దార్ రవితో చర్చించారు. ఆర్డీవో వెంట ఆర్ఐ సుధాకరరెడ్డి, వీఆర్వో రాజునాయక్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి

పత్తికొండటౌన్: వర్షాకాలం ఆరంభమై, ఖరీఫ్ వ్యవసాయ పనులు చేసుకునే రైతులకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అధికారులను ఆదేశించారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామం నుంచి ఆలూరు మండలం మొలగవల్లి గ్రామం వరకు రూ. 7.2కోట్లుతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు, బ్రిడ్జిల నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి రైతులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కాంట్రాక్టరు దశరథరామిరెడ్డికి సూచించారు. ఎమ్మెల్యే వెంట పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, సీఐ మురళీమోహన్, గ్రామసర్పంచ్ నాగప్ప, వైఎస్సార్‌సీపీ గ్రామనాయకులు బనగాని శ్రీనివాసులు, మోహన్‌క్రిష్ణ ఉన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



కందనాతి గ్రామంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్/ఎమ్మిగనూరుటౌన్: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 14వ వార్డులో, మండల పరిధిలోని కందనాతి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక పరిస్థితుల్లో ఉన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తు ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్ల కేశన్న, మాజా ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రసాద్, తిక్కయ్య, సోగనూరు భీమిరెడ్డి, బుట్టారంగయ్య, రియాజ్‌అహమ్మద్, నజీర్‌అహమ్మద్, సునీల్‌కుమార్, షబ్బీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు



మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ ఎస్‌సీ ఆర్.నాగరాజు

ఆలూరు: జిల్లాలో టెండర్లు పూర్తయిన నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ ఆర్ నాగరాజ్ తెలిపారు. హొళగుంద, సులువాయి, మార్లమడికి, ఎల్లార్తి, కోకిలతోట, వివిధ మండల కేంద్రాల్లోని పీహెచ్ కేంద్రాలు, కేబీ 167 రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదోని మండలం ధనాపురం గ్రామం నుంచి హొళగుంద మండల కేంద్రం వరకు మంజూరైన రూ. 65 కోట్ల రోడ్డు పనులను కాంట్రాక్టర్‌చే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 9 పీహెచ్ కేంద్రాలలో రోగులకు 5 నుంచి 8 బెడ్స్ రూంల నిర్మాణానికి ఒక్కో పీహెచ్‌సీకి రూ.9 లక్షలను ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఆలూరులో నూతనంగా అతిథి గృహాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 3 కోట్లతో టెండర్లును పిలిచిందని తెలిపారు. డీఈ వెంకటేశ్వర్లు, ఆదోని ఏఈ రవికుమార్ తదితరులు ఉన్నారు.

బనవాసి వద్ద జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్

- 21న బ్రోచర్ ఆవిష్కరణ
- కుడా వైస్ చైర్మన్ భార్గవ్ తేజ్



మాట్లాడుతున్న కుడా వైస్ చైర్మన్ బార్గవ్‌తేజ్

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు,మధ్య తరగతి ప్రజల కోసం మండలంలోని బనవాసి వద్ద రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, కుడా వైస్ చైర్మన్ భార్గవ్ తేజ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, రూ.18లక్షల్లోపు సంవత్సర ఆదాయం ఉన్న మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం మండల పరిధిలోని బనవాసి వద్ద హైవేకు ఆనుకొని 110 ఎకరాల్లో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఇప్పటికే టౌన్‌షిప్‌కై అన్ని రకాల అనుమతులు తీసుకోవడం జరిగిందని, ఆ భూమిలో 1100ల ప్లాట్లు వేస్తున్నామని చెప్పారు. అందులో 3, 4, 5 సెంట్ల విస్తీర్ణంలో ప్లాట్లు వేసి ప్రభుత్వం నిర్దేశించిన ధరకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఆయా టౌన్‌షిప్ ప్లాట్ల బ్రోచర్లను ఆదివారం ఎమ్మిగనూరులోని సోమప్ప మెమోరియల్ హాల్‌లో విడుదల చేస్తామని, ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో పాటు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి హాజరవుతారన్నారు. అదే రోజు నుంచి ఆన్‌లైన్లో ప్లాట్ల బుకింగ్ ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్లాట్ల ధరలో 20 శాతం, పెన్షనర్లకు 5 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. డిప్ ద్వారా ప్లాట్లు కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్లాట్‌ను కొనుగోలు చేసే వారు ఒకేసారి నగదు మొత్తం చెల్లిస్తే వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. సమావేశంలో స్థానిక, ఆదోని మున్సిపల్ కమిషనర్లు గంగిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, కుడా ప్లానింగ్ ఆఫీసర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



హొళగుందలో వలంటీర్లను సత్కరిస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: ప్రభుత్వం, ప్రజల మధ్య వారదిగా ఉంటూ గ్రామాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలకు వెలకట్టలేమని అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ దాసానాయక్, తహసీల్దారు హుసేన్‌సాహెబ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశా, సింగిల్‌విండో చైర్మన్ బోయ మల్లికార్జున, అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు కోగిలతోట శేషప్ప, పంపాపతి, హనుమప్ప తదితరులు సేవారత్న, సేవామిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను ఘనంగా సత్కరించి పురస్కారాలు అందించారు. హొళగుందలో పని చేస్తున్న 76 మంది వలంటీర్లలో నూరుల్లా, ఆసీఫ్, అనసూయలు సేవారత్న, 71 మంది సేవామిత్ర అవార్డులు అందుకున్నారు. మండలంలో ఐదుగురు సేవా వజ్ర, 184 మందికి సేవా మిత్ర అవార్డులు వరించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

వలంటీర్లకు వందనం

ఆస్పరి: మండలంలోని ఆస్పరి,శంకరబండ,కైరుప్పల గ్రామాలలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆస్పరిలో సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఈఓ రామాంజినేయులు 20 మంది వలంటీర్లను సేవా మిత్ర అవార్డు, శాలువ, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు విజయలక్ష్మి, తిమ్మక్క, నాయకులు పురుషోత్తమరెడ్డి, వీరభద్రి పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

హాలహర్వి: మండలంలోని కొక్కెరచేడు గ్రామంలో గ్రామ సర్పంచ్ మన్మథరెడ్డి సమక్షంలో వైఎస్ ఎంపీపీ నాగేష్ ఆధ్వర్యంలో ఉత్తమ వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలరాజ్, ఈఓపీఆర్‌అండ్ ఆర్డీ మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

115 మందికి సేవా పురస్కారాలు

చిప్పగిరి: మండలంలో 115 మంది వలంటీర్లు సేవా పురస్కారాలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ సుధాకర్ రాజు శుక్రవారం తెలిపారు. ఇందులో ఐదుగురికి సేవారత్న పురస్కారాలు వచ్చాయన్నారు.